క్లుప్తంగా

అధికారులు బాధ్యతగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

బల్లికురవ: వివిధ శాఖల అధికారులంతా బాధ్యతగా పనిచేస్తూ మండలాభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీవో కె. కుసుమ కుమారి కోరారు. శుక్రవారం ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మీ అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ చిత్తశుద్ధితో పనిచేస్తూ గ్రామాల్లోని ప్రజలకు అందుబాటులో సత్వరసేవలు అందించాలన్నారు. అధికారులు ఊకదంపుడు ఉపన్యాసాలకే సమావేశం గంటన్నరపాటు జరిగింది. గ్రామాల్లోని సమస్యలపై చర్చించాల్సిన సభ్యులు, సర్పంచులు నోరు మెదపలేదు. వచ్చాం.. పోయాం అన్నట్లు మౌనంగా కూర్చోవటంతో టీ, బిస్కెట్లకే పరిమితం అయ్యారు. జెడ్పీటీసీ చింతల అంజలి, ఉపాధ్యక్షుడు వీ సుబ్బారెడ్డి, కోఆప్షన్ షభ్యులు షేక్ శ్రీనువలి, తహశీల్దార్ రవినాయక్ తదితరులు మాట్లాడారు.

విధుల్లో అశ్రద్ధ వహిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఆర్డీఓ చంద్రశేఖర్‌నాయుడు

వేటపాలెం: విధుల్లో అశ్రద్ధ వహించిన ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని ఆర్డీవో తూమాటి చంద్రశేఖర్ నాయుడు హెచ్చరించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అక్రమ ఇసుక తరలింపు, అనుమతి లేని లేఅవుట్ లు, ప్రభుత్వ భూములు, డొంక, డ్రైనేజీ, సాన పోరంబోకు భూముల ఆక్రమణల పై వీఆర్ఓలు, వీఆర్ఏలు, సర్వేయర్లు, సిబ్బందితో సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ పరిధిలో చీరాల, వేటపాలెం మండలాల్లో ఎక్కువగా సమస్యలు వస్తున్నాయని చెప్పార. ప్రధానంగా ఇసుక అక్రమం తరలింపుపై అనేక ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. వీటిపై క్షేత్రస్థాయి చర్యలు తీసుకోవాలని ఆదేశించినప్పటికి ఎటువంటి చర్యలు చేపట్టిన దాఖలాలు లేవన్నారు. పుల్లరిపాలెం, పందిళ్లపల్లి నుంచి ఎక్కువగా ఇసుక తరలింపు జరుగుతోందన్నారు. ఈ గ్రామాల్లో ఇసుకను పర్యవేక్షించాల్సిన వీఆర్ఓలు, వీఆర్ఏలు ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. తీరప్రాంత గామాలైన పాపాయిపాలెం, అక్కాయిపాలెం, చల్లారెడ్డిపాలెం, కొత్తపేట గ్రామాల పరిధిలో అధిక సంఖ్యలో అక్రమ లేఅవుట్ లు వేయడం జరిగిందన్నారు. ఏఏ గ్రామాల్లో అక్రమంగా ఎన్ని లేఅవుట్‌లు వేశారు గుర్తించి నివేదికలు ఇవ్వమని చెప్పి పది రోజుల గడువిచ్చినప్పటికి ఇంత వరకు ఎవరూ నివేదికలు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉద్యోగులు తమ విధుల్లో శ్రద్ధగా పని చేయకపోతే తప్పకుండా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అశ్రద్ధ వహించిన వీఆర్ఓలు, సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారి చేయాలని తహశీల్దార్ పార్వతిని ఆదేశించారు.

అమ్మో పొగ.. ఆపై మంచు

- వ్యర్థాల పొగతో భీతిల్లుతున్న ప్రజలు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- సమస్యను పట్టించుకోని అధికారులు



రహదారిపై దట్టంగా అలుముకున్న వ్యర్థ పదార్థాల పొగ

పర్చూరు (చినగంజాం): అసలే శీతాకాంలో మంచుతో ఇబ్బంది పడుతుంటే.. మరో పక్క రోడ్డుపై తగులబెట్టిన వ్యర్థాలతో బెంబేలెత్తుతున్నారు ప్రజలు. రహదారి మార్జిన్‌లో వ్యర్థాలతో కూడిన చెత్త, ఆపై వాటిని నిప్పు పెట్టి తగులబెట్టడంతో అలముకుంటున్న దట్టమైన పొగ. ఇంకేముంది ఆ మార్గంలో ప్రయాణం చేయాలంటేనే భయపడతున్నారు. తప్పనిసరి పరిస్థితులలో చేసేదేమి లేక ప్రయాణికులు, వాహనదారులు సమస్యను ఎదుర్కొంటున్నారు. పర్చూరు నుంచి చీరాల, పర్చూరు నుంచి గుంటూరుకు వెళ్లే మార్గంలో పంచాయతీల చెత్త తెచ్చి వేయడం, వాటికి నిప్పు పెట్టడంతో కాలుష్యంతో కూడిన దట్టమైన పొగ రహదారి నిండా అలుముకొని ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉప్పుటూరు, నాగులపాలెం గ్రామాలకు చెందిన పంచాయతీలలో చెత్తను చీరాల రోడ్డులోని ఉప్పుటూరు చప్టావద్ద తెచ్చి పడేస్తున్నారు. పర్చూరులోని పండ్ల వ్యాపారస్తులు, కొబ్బరి బొండాల దుకాణ దారులు, కూరగాయల దుకాణదారులు తమ వ్యర్థాలను, కుళ్లిన పండ్లు కూరగాయలను తీసుకొని వచ్చి రోడ్డు మార్జిన్‌లలో పడేస్తున్నారు. అసలే వాటి నుండి వెలువడే దుర్వాసనకు ప్రజలు, ప్రయాణికులు ఇబ్బంది పడుతూ ముక్కు మూసుకొని వెళ్తుంటే, దానికి మళ్లీ నిప్పుపెట్టి తగులబడుతుండటంతో దానిని నుంచి వచ్చే కాలుష్యంతో కూడిన పొగ ప్రదజలకు ప్రాణాంతకంగా మారుతోంది. పొగనుంచి వచ్చే విషపూరితమైన కార్బన్ మోనాక్సైడ్ వలన ఊపిరితిత్తులకు ప్రమాదమేర్పడే అవకాశం ఉంది.

రాకపోకలకు తీవ్ర అంతరాయం..

పర్చూరు నుంచి చీరాల, పర్చూరు నుంచి గుంటూరు వెళ్లే మార్గంలో రహదారిపై దట్టమైన పొగ అలముకోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయ కలుగుతోంది. ఎదురుగా వస్తున్న వాహనాలు ఎటువైపు వస్తున్నాయో కనబడక వాహనదారులు, ముఖ్యంగా ద్విచక్రవాహనదారులు తికమకతో ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసరంగా ప్రయాణం చేయాల్సిన 108 వాహనాలు సైతం ఆగి నెమ్మదిగా పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. జాతీయ రహదారి పనులు ముమ్మరంగా జరుగుతుండటంతో భారీ టిప్పర్ వాహనాలు అతి వేగంతో ప్రయాణిస్తుండటం ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కొని సెకన్లపాటు కళ్లు కన్పించక ఎటువైపు వెళ్తున్నామో తికమకకు గురవుతున్నారు.

చెత్త సంపద కేంద్రాలు ఉన్నా.. శూన్యం

వ్యర్థ పదార్థాలను ప్రయోజకరంగా మార్చుకునే విధానంలో భాగంగా ప్రభుత్వమే స్వయంగా ఏర్పాటు చేసిన చెత్త సంపద కేంద్రాలు దిష్టిబొమ్మలుగా మారాయి. పర్చూరు మండలంలో పలు పంచాయతీల్లో ఉన్నప్పటికీ చెత్తతో అవస్థలు తప్పడం లేదు. చెత్త సంపద కేంద్రాల్లో తడిచెత్త, పొడిచెత్తను వేరు చేసి వాటి నుంచి వర్మీకం పోస్టు, ముడి సరుకులను తయారు చేయాల్సి ఉంది. కాని పర్చూరు పరిధిలో అలాంటి పరిస్థితి కనిపించక పోగా ప్రజలకు వ్యర్థ పదార్థాలు వాటిని తగులబెట్టగా వచ్చిన పొగతో తీవ్ర సమస్య తలెత్తుతుంది.

> **పంచాయతీలకు, వ్యాపారులకు నోటీసులు జారీ చేస్తాం..**
>
> పంచాయతీల చెత్తను స్థల కొరత కారణంగా తెచ్చిపోస్తున్న మాట వాస్తవమే. అయితే పండ్ల వ్యాపారులు కుళ్లిన పండ్లు, ఖాళీ కొబ్బరి బొండాలు అక్కడ పడవేస్తున్నారు. దాంతో సమస్య జఠిలమైంది. ఈ విషయమై పంచాయతీలకు, వ్యాపారస్తులకు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటాం. సత్వరం జేసీబీని తెప్పించి రోడ్డు వెంబడి చెత్తను పూర్తిగా తొలగిస్తాం.
>
> – కే సత్యనారాయణ, ఈఓపీఆర్డీ

> **విషపూరిత వాయువులతో ఇబ్బందిగా ఉంది..**
>
> 
>
> రాష్ట్ర, జాతీయ రహదారుల వెంట పడేసిన చెత్తను కాల్చివేయకూడదు. దాని వలన అందులో నుంచి వెలువడే విషవాయువు కార్బన్ మోనాక్సైడ్‌తో కళ్లకు మంటలు వస్తాయి. అందుకోసం కళ్ల మూసుకుంటే ప్రమాదాలు జరిగేందుకు అవకాశం ఉంది. అధికారులు తక్షణం వ్యర్థాలను తొలగించాలి.
>
> – షేక్ మహబూబ్ సుభాని, ముస్లిం మైనార్టీ యూత్ నాయకుడు, నూతలపాడు

> **పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలి..**
>
> 
>
> రోడ్డు పక్కన వ్యర్థాలు పడేయకుండా ఆయా పంచాయతీల అధికారులు చర్యలు తీసుకోవాలి. వ్యర్థ పదార్థాలను తగులబెట్టిన సందర్భాల్లో అగ్నిమాపక సిబ్బంది, పోలీసులకు సమాచారం అందించి చర్యలు తీసుకోవాలి.
>
> – జూపూడి రోశయ్య, దేవరపల్లి

రైతులను ముంచినా.. అధికారులకు పట్టదా?



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతుసంఘం నాయకులు, బాధిత రైతులు

యద్దనపూడి: ఆరుగాలం కష్టపడి చెమటోడ్చి పండించిన పంట ఉత్పత్తులను రైతుల నుంచి కొనుగోలు చేసి రూ.5 కోట్లకు ఐపీ పెట్టిన వ్యాపారి నుంచి నగదు రికవరీ చేసి రైతులను ఆదుకోవాలని రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం యద్దనపూడి తహశీల్దారు కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతూ చిలకలూరిపేట పరిధిలోని కోల్డ్‌స్టోరేజ్‌లో తాము పండించిన పంటలను దాచుకోగా కోల్డ్‌స్టోరేజ్‌లో పనిచేసే గుమస్తాగా పనిచేస్తున్న చిలకలూరిపేట పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన నాగరాజు అనే వ్యక్తి సుమారు 70 మంది రైతులకు చెందిన శనగపంటను రైతులకు తెలియకుండా అమ్ముకున్నాడని తెలిపారు. ఇది జరిగి నెలరోజులు దాటిందని డబ్బులు అడుగగా పరారయ్యాడన్నారు. రైతులు సదరు నాగరాజును పట్టుకొని పోలీసులకు అప్పగించటం జరిగినా వారు ఎటువంటి విచారణ గానీ దర్యాప్తు కానీ చేయకుండానే కోర్టుకు హాజరుపరిచారన్నారు. ఈ విషయాన్ని చిలకలూరిపేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు, మంత్రులు నారా లోకేష్, గొట్టిపాటి రవికుమార్‌కు జరిగిన అన్యాయాన్ని వివరించినా వారు పట్టించుకోలేదన్నారు. ఈ వ్యాపారి చిలకలూరిపేట, యద్దనపూడి, మార్టూరు మండలాలకు చెందిన 70 మంది రైతుల వరకు మోసపోయారన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు తగు చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని లేని పక్షంలో ఈ నెల 6వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు రైతుసంఘం నాయకుడు బత్తుల హనుమంతురావు హెచ్చరించారు. ఈ మేరకు తహశీల్దారు రవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బాధిత రైతులు గొట్టిపాటి వెంకట్రావు, పెరవల్లి శ్రీనివాసరావు, అత్తోటి శ్రీనివాసరావు, జాగర్లమూడి శ్రీనివాసరావు, చిన్నం సురేష్, గొట్టిపాటి విజయలక్ష్మి, కర్లపూడి సుబ్బారావు, యలనాటి హనుమంతురావు రైతులు పాల్గొన్నారు.

బైకు అదుపుతప్పి యువకుడికి గాయాలు

బల్లికురవ: పని నిమత్తం బైకుపై వెళ్తుండగా అదుపుతప్పి కిందపడి ఓ యువకుడు తీవ్రగాయాల పాలయ్యాడు. ఘటన శుక్రవారం సాయంత్రం అద్దంకి-బల్లికురవ ఆర్అండ్‌బీ రోడ్డులోని కొమ్మినేనివారిపాలెం క్రాస్‌రోడ్ సమీపంలో జరిగింది. అందిన వివరాల మేరకు.. అద్దంకి మండలం రెడ్డిపాలెం గ్రామానికి చెందిన పీ. హనుమంతరావు, అదుపుతప్పి కిందపడిపోగా తలకు తీవ్రగాయా లయ్యాయి. స్థానికులు 108 కి సమాచారం అందించారు. బల్లికురవ నుంచి వాహన ఈఎంటీ నాగరాజు, పైలెట్ కెరామాజంనేయులు ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన చికిత్స కోసం ఒంగోలు తరలించారు.

నడుస్తూ పడిపోయిన వ్యక్తి..

అద్దంకి: మద్యం మత్తులో నడుస్తూ ఓ వ్యక్తి పడిపోయి ఘటన పట్టణంలోని బస్టాండు లోపలి గేటు సమీపంలో శుక్రవారం జరిగింది. అందిన సమాచారం మేరకు ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలంలోని రాజానగరం గ్రామానికి చెందిన చంద్రమౌళి మద్యం మత్తులో బస్టాండు సమీపంలో తూలి కిందపడ్డాడు. దాంతో అతనికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచార మేరకు 108 సిబ్బంది వాహనంలో వైద్యశాలకు తరలించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయమందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

చినగంజాం: మండలంలోని గొనసపూడి సచివాలయంలో సంక్షేమం, విద్య సహాయకులుగా విధులు నిర్వహిస్తూ ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన ఆసోది నరేంద్రబాబు కుటుంబానికి సచివాలయ సిబ్బంది ఆర్థిక సాయం అందించారు. శుక్రవారం జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి రాజ్‌దెబోరా చేతుల మీదుగా రూ. 64 వేల నగదును నరేంద్ర భార్య నాగలక్ష్మికి అందజేశారు. జిల్లాలోని 25 మండలాలకు చెందిన సచివాలయ సిబ్బంది నగదును సేకరించి నరేంద్ర కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో చీరాల సాంఘిక సంక్షేమ సహాయ అధికారి సైదారెడ్డి, రేపల్లె సాంఘిక సంక్షేమ సహాయ అధికారి సత్యనారాయణ, రాష్ట్ర సచివాలయ సంక్షేమ కమిటీ పంగులూరు శ్రీనివాస్ పాల్గొన్నారు.

రుణాల రికవరీలు తప్పనిసరి

చీరాల టౌన్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అందిస్తున్న రుణాలను పొదుపు మహిళలు సక్రమంగా వినియోగించుకునేలా కృషి చేయాలని ఐకేపీ పథకం ఏపీఎం మధుబాబు సూచించారు. శుక్రవారం మండలంలోని బుర్లవారిపాలెంలోని స్త్రీశక్తి భవనంలో ఐకేపీ మండల సమాఖ్య ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ.. పొదుపు సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని, వివిధ వ్యాపారాలు, సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న సభ్యుల జీవనోపాధిని పెంచేలా పొదుపు సంఘాల ఏపీఎంలు, అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ సంఘాలు ప్రతినెలా సమావేశాలను నిర్వహించుకొని సంఘం అభివృద్ధికి లీడర్లు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య ప్రతినిధులు, సీసీ, సీవీలు పాల్గొన్నారు.

కార్మికులకు జీతాలు చెల్లించాలని నిరసన



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మిక సంఘ నాయకులు

అద్దంకి: పట్టణంలోని మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఇంజినీర్ విభాగం కార్మికులు సమస్యల్ని పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అద్దంకి మున్సిపల్ ఆఫీసు వద్ద ధర్నా నిర్వహించి నిరసన చేపట్టారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ డి రవీంద్రకు డిమాండ్‌తో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆదాం, సామేలు, పెద్దమార్కు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం



ఇసుక ట్రాక్టర్‌తో ఎస్సై వెంకటేశ్వర్లు

వేటపాలెం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌ను పట్టుకొని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఏ వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. పందిళ్లపల్లి గ్రామం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నమని చెప్పారు. ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అక్రమంగా ఇసుక తరలించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

పెన్షనర్‌ల సమస్యల పరిష్కారానికి కృషి



పెన్షనర్‌లను సన్మానించిన విశ్రాంత ఉద్యోగుల సంఘం

ఇంకొల్లు (చినగంజాం): పెన్షనర్‌ల సమస్యల సత్వర పరిష్కారానికి తాను కృషి చేస్తానని చీరాల ఉపఖజానా అధికారి మద్ది వెంకట సుబ్బారావు పేర్కొన్నారు. ఇంకొల్లు శాఖ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పెన్షనర్స్ డే కార్యక్రమాన్ని ఇంకొల్లులో నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షుడు యర్రగుండ కృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. తగిరశ వీరాంజనేయులు పెన్షన్ సాధన కార్యసాధకుడు నకారా విగ్రహాన్ని ఏర్పాటు చేయగా ఆవిష్కరించారు. అనంతరం 75 ఏళ్లు నిండిన 21 మంది పెన్షనర్‌లను ఘనంగా సన్మానించారు. బాపయ్య, శ్రీరామచంద్రమూర్తి తదితరులు ఇంకొల్లులో విశ్రాంత ఉద్యోగుల శాఖను ఏర్పాటు చేయడం వారి సమస్యలను తీర్చడంలో చేస్తున్న కృషి అభినందనీయం అని అన్నారు. ఈ సందర్భంగా ఇడుపులపాడుకు చెందిన విశ్రాంత ఉద్యోగి గోరంట్ల మోహనరావు, అమ్మనమంచి శ్రీనివాసరావు చెరో రూ.10 వేలు సంఘానికి విరాళంగా ప్రకటించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా శాఖ-2 అధ్యక్షులు రావుల బాపయ్య చౌదరి, ప్రధాన కార్యదర్శి కరి కమలేశ్వర రావు, కోశాధికారి పుట్టంరాజు శ్రీరామచంద్ర మూర్తి, మార్టూరు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారులు షేక్ కమాలుద్దీన్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే గొప్ప సంఘసంస్కర్త

- ఘనంగా జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం
- ఉపాధ్యాయినులకు సత్కారం



శింగరకొండలో ఉపాధ్యాయురాలిని సత్కరించిన అతిథులు



ఇడుపులపాడులో సావిత్రిబాయికి నివాళులర్పిస్తున్న హెచ్ఎం పేరిరెడ్డి, విద్యార్థులు



మున్నంవారిపాలెంలో మహిళ ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న విద్యార్థులు

కారంచేడు/మార్టూరు/యద్దనపూడి/చినగంజాం: సావిత్రిబాయి పూలే దేశ మహిళా సంఘ సంస్కర్త అని ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం పిడవర్తి పేరిరెడ్డి అన్నారు. ఇంకొల్లు మండలం ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాలలో భారతీయ సంఘ సంస్కర్త, ఉపాధ్యాయిని, రచయిత్రి సావిత్రిబాయి పూలే జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సావిత్రిబాయి నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన జ్యోతిరావు పూలే భార్య అని చెప్పారు. కులమత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమ స్వరూపిణి అని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొని సావిత్రిబాయి పూలేకు నివాళులర్పించారు.

■ జాతీయ మహిళా దినోత్సవాన్ని చినగంజాం మండలంలోని పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. మున్నంవారిపాలెం ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయి చిత్రపటానికి పాఠశాల హెచ్ఎం మల్లారెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మహిళా ఉపాధ్యాయిని పల్లపోలు హిమవంతేశ్వరిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్ చంద్రశేఖర్, ఎస్ నాగమల్లేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

■ మార్టూరు మండలం వలపర్లలో నేతాజీ విద్యాసంస్థల ఆవరణలో సావిత్రిబాయి పూలే జయంతి ఘనంగా నిర్వహించారు.

■ సావిత్రిబాయి పూలే జీవితం మహిళలకు ఆదర్శమని కారంచేడు ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు అన్నారు. కారంచేడు ఎమ్మార్సీలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొడవలివారిపాలెంలో ఉత్తమ సేవలందించిన గణితం ఉపాధ్యాయురాలు భానుప్రియలను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఉమామహేశ్వరరావు పీ బాబు, కే బాబ్జీ, ఎస్ వీరమస్తాన్, వై శ్రీకాంత్, బీ శ్రీనివాసులు, కే రాజు, సీహెచ్ తిమోతీ, కే కోటయ్య, పీ శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు కేక్ కట్ చేసి విద్యార్థులకు స్వీట్లు పంచారు.

26 మంది ఉపాధ్యాయునులకు సన్మానం..

అద్దంకి/మేదరమెట్ల: దేశంలోనే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే మహిళలందరికీ ఆదర్శమని శాసనాల పరిశోధకుడు జ్యోతి చంద్రమౌళి అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో శింగరకొండలో సావిత్రిబాయి జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో 26 మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. అంతకుముందు వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు ప్రదర్శించిన నత్యాలు, పాటలు, సావిత్రిబాయి వేషధారణలు అతిథులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ గాయత్రీదేవి అధ్యక్షత వహించగా ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు జ్యోతిరమేష్‌బాబు, దేవపాలన, రామాంజనేయులు, అన్నంనేని వెంకటరావు, చెన్నుపల్లి నాగేశ్వరరావు, జ్యోతి శ్రీమన్నారాయణమూర్తి పాల్గొన్నారు.

■ కొరిశపాడులో అంబేడ్కర్ ఎంపీపీ పాఠశాలలో సావిత్రబాయి జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో పున్నయ్య పాల్గొని సావిత్రబాయి గురించి మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీడీపీవో కృష్ణకుమారి, సీడీఎస్ సూపర్‌వైజర్ ఇందిర, జ్యోతి, అరుణ పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. దీనిలో భాగంగా పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కార్యదర్శి మురళీ సుధాకరరావు, జ్యోతి చంద్రమౌళి, ఎజీపి వై రమేష్‌బాబు, ఆంజనేయులు పాల్గొన్నారు.

చీరాల రూరల్: బీసీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎన్‌జీవో కార్యాలయంలో సావిత్రిబాయి జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాచర్ల మోహనరావు, న్యాయవాది మస్తాన్‌రావు, ఎనుమల యానాదిరావులు మాట్లాడారు. కార్యక్రమంలో బీసి ఫెడరేషన్ నాయకులు పి. కొండయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



అద్దంకిలో సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రోటరీ సభ్యులు



చీరాల: సావిత్రి బాయిపూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మహిళా ఉపాధ్యాయులు



కొరిశపాడులో సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అతిథులు



కొడవలివారిపాలెంలో ఉపాధ్యాయురాలిని సత్కరించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు



సంతమాగులూరులో విజేతలకు మొమెంటోలు అందిస్తున్న అతిథులు

భద్రారెడ్డిని కలిసిన జిల్లా ప్రధాన కార్యదర్శి



భద్రారెడ్డిని సత్కరిస్తున్న ప్రసాదరెడ్డి

బల్లికురవ: జిల్లా వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన ఉప్పుమాగులూరు గ్రామ నాయకుడు కల్లి అంజనీ ప్రసాదరెడ్డి శుక్రవారం ఏఎంసీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు వైవీ భద్రారెడ్డిని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు. పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు, భద్రారెడ్డి తనకు అప్పగించిన ప్రధాన కార్యదర్శి పదవికి న్యాయం చేస్తానన్నారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చెస్తానని తెలిపారు. మండలంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మాజీ సర్పంచ్‌లు, గ్రామ స్థాయి నేతలు ఆయనకు అభినందనలు తెలిపారు.